# ఒక స్వప్నము

రెండుసౌధములు. ఒకదానికెదురుగ నొకటి. ఒకదానికన్న నెత్తుగ నొకటి. చుట్టునిండ్లులేవు. ఊరులేదు. బాటలులేవు. పెద్దబయలు. పూర్ణమగు నిశ్శబ్దము. సన్నని చంద్రుఁడు మబ్బులేని ఆకసమున వెలవెలఁబోవుచుండెను. దీర్ఘమగునీడలు చుట్టుకొనిన కొండశిలలవలె సౌధములప్రక్క నిదురవోవుచుండెను. ఒక బాలిక మెల్లగదిగివచ్చెను. వెన్నెలలో నొక నిముషము గోచరమయ్యెను. క్రిందినీడలో మాయమయ్యెను. రెండవ సౌధముచివర తిరిగి గదితలుపుతట్టుచు వెన్నెలయందు కాన్పించెను. తలుపు తెరువఁబడెను. ఒకయువకుఁడు ద్వారము కడనిలిచి కన్నులు నులుముకొనుచు చూచెను. ముఖమున నాశ్చర్యము. ఒకముహూర్తమట్లె నిలువఁబడియుండిరి. నేత్రము లేమోమొ మాట్లాడెను. క్రిందికిదిగిరి. నీడలో మాయమైరి.

సముద్రతీరము. చలి. సన్నగఁబాడుగాలి. అల లొకదానిపైనొకటి దొర్లుచు ధవళత్వమున నుప్పొంగి యొకటేయాట. వానికేమిలక్ష్యము? ఏప్రొద్దోతెలియదు. సన్నని వెలుతురుమాత్రము. ఉషఃకాలమో, సాయంకాలమో, మధ్యరాత్రి నస్తమించు చంద్రునివలనకలుగుకాంతియో! ఆయౌవనుఁడును యువతియు వడివడిగనడచుచుండిరి. అతనిచేయియామె నడుమును కౌఁగిలించుకొనియుండెను. ఆమెయు హస్తము నానుకొని అతని

శీఘ్రగమనము ననుకరించుచుండెను. చూపులెంతవఱకును ముందునకే. చలిలేదువారికి. సముద్రసౌందర్యమునుచూచి యానందములేదు. ఈవైపున సముద్రము. ఆవైపున రాజమార్గము.

ఒక మోటారుశకటము. దానివద్ద నొకముదుసలియు, నిద్దఱు చిన్ని బాలికలును. బాలికలు తరంగములకవ్వించుచు, నవ్వుచు నొకటే యాట. యౌవ్వనుఁడు దాహమిమ్మని సంజ్ఞ చేసెను. మోటారుకప్పుపై నుండు పింగాణీపాత్రనుచూపి ముదుసలి తనబాలికలవైపుచూచుచుండెను. వీరలెవరనియడిగినవారలుకారు దానియందుండెడి (కాఫీ యనుకొంటిని) ద్రవము నాబాలికచే నాతఁడు త్రావించెను. వడిగ నడచుచుండిరి.

ఇంకొక పెద్దమోటారుశకటము. మదరాసు కోమట్లిద్దఱు దాని యందు "ఎచటినుండియో పారిపోవుచున్నారు. పాపము! ఎంతకష్టము!" అనిరి. అంతే, లోకమెప్పుడునంతే.

నడచుచుండిరి. బాటపై నెదురుగవచ్చుచుండిరి ముగ్గురు. నలువది యేండ్లపురుషుఁడు, ఇద్దఱుస్త్రీలు, ఒకపెద్దమూట. వారినిచూచి బాలిక ముఖమునభయము. వెనుకకొదిగినది. ఆమువ్వురిముఖముల నాశ్చర్యము. ఆశ్చర్యము క్రోధముగ మారినది. గుసగుసలాడికొనిరి. నేనిట్లుగ్రహించి తిని:—బాలిక యీతని ప్రేమించెను. బలవంతముగ నితరునకు వివాహము గావింపఁబడెను. బంధువులగు వీరు ఆలస్యముగ ఆపెండ్లికేపోవుచుండిరి. పురుషుఁడు బాటదిగి తరంగములు భూమినికౌగలించుకొనుస్థలమున నిలువఁ బడెను. ఈయిద్దరు నాగిరి. ఏదియో మాటలాడెను. బాలికను తనవెంట రమ్మనెను. నాగుండెలు కొట్టుకొనసాగెను. "ఇప్పు డేమిచేయుదును?" అను కొంటిని. ఎచ్చటనుండియోకాని అంతయు చూచుచునేయుంటిని. కాని నాకుశరీరములేదు. ఏమిచేయుదును. చేయుటకు వీలైనదా, ప్రాణముల నర్పించియుందుననునంత ప్రేమకలిగినది. పిఱికివాడనగు నాభయమేకాని,

యౌవనుఁడేమియు చలింపలేదు. సముద్రతీరమునుండి దేనినో నల్లనిదానిని పైకితీసెను. పురుషునివక్షమునకు గుఱిచూపెను. అంతయు నొకనిముష మున జరిగెను. "చంపెదను. లేకున్న నిరువురము చత్తుము" బాటపై నున్న నిద్దఱు ముసలిపెంకెముత్తయిదువలు మోఁకాళ్లువంచి, నోర్లు తెరచి, గుడ్లగూబలవలె మూటనుబట్టుకొని చూచుచున్నారు. ఆశ్చర్యమో, భయమో, చలియో! వారికాశ్చర్యము నాకాశ్చర్యము. వారికి భయము, నాకుభయము. సముద్రమునకును. గాలికిని భయముకాన్పింపలేదు. ఆయువకునికినిలేదు. "నరహత్యకు సిద్ధపడెనే యీతడు ? ప్రేమబలము !" అనుకొంటిని. ముదుసలి తొలకముడిచెను. "అయిన నెక్కడకుపోదురులే ! వెనుకనుండి పంపెదను" అనెను. అదిద్వీపముకాఁబోలు. అందుకే అట్టిధైర్యము. చుట్టును సముద్రము కాఁబోలు. పాపము!

ఏమియు జరగనట్లె నడచుచుండిరి. ఒకమాటైనలేదు. చిరునవ్వయిన లేదు. ప్రేమసూచనలునులేవు. కావలసినదంతయు నాహస్తస్పర్శయే చెప్పుచుండెకాఁబోలు !

పూర్ణమగు నంధకారము. నక్షత్రకాంతి. చిన్నిపడవను వదలించి యువకుఁడు లోనికినెట్టెను. ఇరువురు నధిష్ఠించిరి. అప్పుడు వింటిని యాజవ్వని మృదుకంఠస్వరము. ఇప్పుడైన యువకునితోకాదు. రెండు చేతులతో కన్నులుమూసికొని, తలవంచి "తండ్రీ ! ఆపదుద్ధారకా ! నీవు గాక గతిలేదు. ఇచక నీవుగాక యింకెవరునులేరు. సముద్రమునీది. నీ

6)

వలననే శాంతమువహించినది. నీవుతప్ప దిక్కులేదు. రాత్రియంతయు మాతోడనుండు మూడవవాడవు నీవె" పైనక్షత్రములు మిణుకుమనెను. నీరుచప్పుడుచేసెను. గాలి చెంపలనుండి ముంగురుల కదల్చెను. తెడ్డు పడెను. పడవకదిలెను. అలలులేవు. పరమశాంతము. నీటిచారలో కదలు నక్షత్రకాంతి. నీటిపై గాలి. సన్ననిరోదనము. ఎటుచూచిన జలము. అంధ కారము. ఆకసము సముద్రము. ఒక జేనెఁడుకొయ్యపడవమాత్ర మాధా రము. పైన ఉన్నతము. క్రిందనగాధము. చలి. ఒడ్డుకానరాదు. ఎరుగు దురు? ఎటుపోవుదురు ? గతియేమి ?

నాకు మెలఁకువవచ్చెను.

గుడిపాటి వెంకటాచలం,

అనసూయ మాసపత్రిక,

ఫిబ్రవరి 1919

★

# యేం తప్పు?

ఛీ. తప్పేమిటి ?

యిట్లారా

చీకటి వెలుతురుతో మెరుగుపట్టినట్లు, నీ జుట్టుమీద చెయ్యేసి, నీ సన్నని, తెల్లని, మెత్తని చెంపల్ని తాకడం తప్పా ?